## భారత హైకమిషనర్ అడ్డగింత

### గురుద్వారాలోకి వెళ్లకుండా అడ్డుపడ్డ ఖలిస్థానీలు

లండన్ : ఖలిస్థానీ మద్దతుదారులు మరోసారి రెచ్చిపోయారు. స్కాట్లాండ్‌లోని గ్లాస్కోలో ఉన్న గురుద్వారా కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లిన లండన్‌లోని భారత హైకమిషనర్ విక్రమ్ దొరైస్వామిని ఖలిస్థానీ మద్దతుదారులు అడ్డుకున్నారు. ఆహ్వానం లేదంటూ వెనక్కి పంపించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. బ్రిటన్‌లోని ఏ గురుద్వారాలోనూ భారత అధికారులకు అనుమతి లేదని ఓ ఖలిస్థానీ మద్దతుదారు పేర్కొనడం గమనార్హం. దీనిపై భారత్ తీవ్రంగా స్పందించింది. దీన్ని అవమానకర చర్యగా పేర్కొంది. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు బ్రిటన్ ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లింది. భారత హైకమిషనర్‌ను అడ్డుకోవడంపై బ్రిటన్ తీవ్రంగా స్పందించింది. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని భారత్‌కు హామీ ఇచ్చింది.

**ఆధారాలుంటే చూపించండి**


ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య విషయంలో కెనడా చేసిన ఆరోపణలను భారత్ మరోసారి ఖండించింది. ఆధారాలు ఉంటే చూపించాలని సవాల్ విసిరింది. అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో శనివారం విదేశాంగ మంత్రి జై శంకర్ విలేకర్లతో మాట్లాడారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, వాక్‌స్వాతంత్ర్యం హింసగా మారకూడదని పేర్కొన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి ఒకరి వద్ద నేర్చుకోవాల్సిన అవసరం భారత్‌కు లేదని తెలిపారు.

## స్టార్‌లింక్‌కు చైనా పోటీ

బీజింగ్, సెప్టెంబర్ 30: ఎలాన్ మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్‌తో చైనా పోటీకి దిగింది. విస్తృత బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలు అందిస్తున్న స్టార్‌లింక్‌కు పోటీగా జీ60 స్టార్‌లింక్‌ను ఆ దేశం అభివృద్ధి చేస్తున్నది. దిగువ భూకక్ష్యలో 12 వేల శాటిలైట్లను ఉంచేలా చైనా పరిశోధకులు దీన్ని తయారు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో పురోగతి సాధించినట్టు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ తెలిపింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని గువో వాంగ్‌లో కంపెనీ దీన్ని అభివృద్ధి చేస్తున్నది. కాగా, స్పేస్ ఎక్స్‌కు చెందిన స్టార్‌లింక్ 13 వేల శాటిలైట్ల సాయంతో సేవలు అందిస్తున్నది.

# నిద్రలేవకుంటే జరిగేది ఇదే!

- చంద్రుడిపై నిద్రావస్థలోనే విక్రమ్, ప్రజ్ఞాన్
- నిద్రలేపేందుకు ప్రయత్నిస్తున్న శాస్త్రవేత్తలు
- నియంత్రణలోకి రాకుంటే పనికిరాని స్థితిలోకి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 మిషన్ విజయవంతమైంది. చంద్రుడిపై కాలుమోపిన విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ తమకు అప్పగించిన పని పూర్తిచేశాయి. 14 రోజులపాటు (చంద్రుడిపై ఒక పగలు) పరిశోధనలు చేసిన ఈ రెండూ ఆ తర్వాత రాత్రి కావడంతో నిద్రావస్థలోకి వెళ్లిపోయాయి. మళ్లీ అక్కడ లూనార్ డే పూర్తయ్యాక వాటిని నిద్ర లేపి ప్రయోగాలకు పురమాయించాలన్న ఇస్రో ప్రయత్నాలు ఇప్పటి వరకు ఫలించలేదు. శాస్త్రవేత్తలు మాత్రం తమ ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఒకవేళ వారి ప్రయత్నాలు ఫలించక అవి అక్కడే శాశ్వతంగా ఉండిపోతే ఏం జరుగుతుందో చూద్దాం. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ రెండూ శాస్త్రవేత్తల నియంత్రణలోకి రాకుంటే చాలా మార్పులు సంభవిస్తాయి. పగలు విపరీతమైన వేడి, రాత్రి మైనస్‌లలోకి పడిపోయే ఉష్ణోగ్రతల కారణంగా వాటి నిర్మాణం దెబ్బతింటుంది. వాటిలోని పదార్థాలు వేడికి వ్యాకోచించి, చల్లదనానికి కుంచించుకుపోతాయి. అదే పనిగా ఇలా జరిగితే వాటి నిర్మాణం పనికిరాకుండా పోతుంది. చంద్రుడి ఉపరితలంపై ఉండే రెగోలిత్‌గా పిలిచే దుమ్ము రోవర్, ల్యాండర్‌లోకి చేరుతుంది. చంద్రుడి ఉపరితలం నిరంతరం సూక్ష్మ ఉల్కాకణాల పేలుళ్లకు గురవుతుంది. ఈ కణాలు రోవర్, ల్యాండర్ ఉపరితలాలను దెబ్బతీసే అవకాశం ఉంది. భూమిలా చంద్రుడిపై దట్టమైన వాతావరణం లేకపోవడం వల్ల చంద్రుడి ఉపరితలం నేరుగా సూర్యుడి రేడియేషన్‌కు, కాస్మిక్ కిరణాలకు గురవుతుంది. అదేపనిగా ఎక్కువకాలం వీటికి గురవడం వల్ల విక్రమ్, ప్రజ్ఞాన్‌లోని ఎలక్ట్రానిక్ పరికరాలు దెబ్బతింటాయి. సోలార్ ప్యానెల్స్ ద్వారా సూర్యరశ్మిని గ్రహించి విక్రమ్, ల్యాండర్ పనిచేస్తాయి. వీటిపై దుమ్ముధూళి పేరుకుపోతే సూర్యుడి కాంతిని అవి గ్రహించలేవు. అప్పుడు బ్యాటరీలు ఎందుకూ కొరగకుండా పోతాయి. అదే జరిగితే మిగతా వ్యవస్థలు సక్రమంగా ఉన్నా వృథానే. ఇక, చివరిగా శాస్త్రవేత్తల ప్రయత్నాలన్నీ విఫలమై అవి ఇక భూమితో శాశ్వతంగా సంబంధాలు కోల్పోతే చంద్రుడిపై శాశ్వతంగా భారత రాయబారులుగా మిగిలిపోతాయి.

## 9.2 లక్షల కిలోమీటర్ల దూరంలో ఆదిత్య

బెంగళూరు : ఇస్రో ప్రయోగించిన ఆదిత్య-ఎల్1 శాటిలైట్ లక్ష్యం దిశగా వడివడిగా పయనిస్తున్నది. భూ కక్ష్యలను పూర్తి చేసుకొని భూ ట్రాన్స్‌ఫర్ కక్ష్యలోకి ప్రవేశించిన ఆదిత్య-ఎల్1 తాజాగా భూ ప్రభావ గోళాన్ని విజయవంతంగా దాటింది. భూ ఉపరితలం నుంచి 9.2 లక్షల కిలోమీటర్ల దూరంలోని భూ ప్రభావ గోళాన్ని దాటి సూర్యుడి వైపు ఆదిత్య-ఎల్1 పరుగులు పెడుతున్నదని తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో ఇస్రో వెల్లడించింది. 'భూ ప్రభావ గోళాన్ని విజయవంతంగా దాటి వెళ్లగలిగే శాటిలైట్‌ను భారత్ ప్రయోగించడం ఇది రెండోసారి. గతంలో మార్స్ ఆర్బిట్ మిషన్‌ను మొదటిసారిగా ప్రయోగించింది' అని ఇస్రో తెలిపింది.

# మెడికల్ కాలేజీలన్నీ వార్షిక నివేదిక సమర్పించాలి

- ఉల్లంఘిస్తే రూ.కోటి జరిమానా..

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలోని మెడికల్ కాలేజీలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) తాజాగా కొత్త నిబంధనలను నోటిఫై చేసింది. కొత్త రూల్స్ ప్రకారం అన్ని మెడికల్ కాలేజీలు తప్పనిసరిగా వార్షిక ప్రకటన నివేదిక(ఏడీఆర్)ను కమిషన్‌కు సమర్పించాల్సి ఉంటుంది. కళాశాలలో మౌలిక సదుపాయా లు, అవసరమైన అర్హత కలిగిన అధ్యాపకులు, రోగుల సంఖ్యకు అనుగుణంగా సరిపడా క్లినికల్ మెటీరియల్, విద్యార్థులకు గ్రేడింగ్, విద్యార్థుల ఫీడ్‌బ్యాక్, మెడికల్ విద్య ప్రమాణాలకు సంబంధించిన ఇతర పారామితులు వంటి వివరాల వంటి సమాచారం వార్షిక నివేదికలో ఇవ్వాలి. దీన్ని పాటించకుండా ఉల్లంఘస్తే సదరు మెడికల్ కాలేజీపై రూ.కోటి జరిమానా విధించొచ్చు. అదేవిధంగా తప్పుడు సమాచారం సమర్పించినందుకు రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ రెగ్యులేషన్ ప్రకారం ప్రొఫెషనల్ ఎథిక్స్ దుష్ప్రవర్తనకు శిక్షార్హ చర్యతో పాటు అధ్యాపులు, డీన్ లేదా డైరెక్టర్‌పై రూ.5 లక్షల జరిమానా వేసేందుకు అవకాశం ఉన్నది.

**అక్రిడిటేషన్ నిలుపుదల లేదా వెనక్కు!**

దేశంలో అత్యున్నత వైద్య విద్య నాణ్యతా ప్రమాణాలు కల్పించేందుకు కొత్త నిబంధనలను తీసుకొచ్చినట్టు ఎన్ఎంసీ తెలిపింది. ఎన్ఎంసీ పేర్కొన్న షరతులను మెడికల్ కాలేజీలు పాటిస్తున్నాయా లేదా అనేదాన్ని నిర్ధారించేందుకు సంబంధిత బోర్డులైన పీజీఎంఈబీ లేదా యూజీఎంఈబీ వార్షిక ప్రకటన నివేదికను మూల్యాంకనం చేస్తాయని నోటిఫికేషన్‌లో వెల్లడించింది. పైన పేర్కొన్న నిబంధనలకు కట్టుబడి ఉండాలని ఎన్ఎంసీ మెడికల్ కాలేజీలకు హెచ్చరికలు జారీ చేసింది. జరిమానాలతో పాటు అదనంగా ఐదు అకడమిక్ సంవత్సరాలపాటు కాలేజీల అక్రిడిటేషన్‌ను నిలుపుదల లేదా వెనక్కు తీసుకొనే చాన్స్ కూడా ఉన్నదని ఎన్ఎంసీ నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఎవరితోనైనా లేదా ఏ సంస్థతోనైనా ఎన్ఎంసీ, యూజీఎంఈబీ, పీజీఎంఈబీలపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తే.. ఆయా మెడికల్ కాలేజీకి సంబంధించిన అన్ని దరఖాస్తులు, అభ్యర్థనల ప్రక్రియలను నిలిపివేస్తామని హెచ్చరించింది.





